క్లుప్తంగా

స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డి (ఫైల్)

దర్శి: దేవదాయ శాఖ ట్రిబ్యునల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా కేవీ సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుధాకర్‌రెడ్డి దర్శిలో న్యాయవాదిగా పని చేస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. సుధాకర్‌రెడ్డి నియమితులైన సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం హనుమంతరావు

ముండ్లమూరు: సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం హనుమంతరావు అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో గురువారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసి దళిత మహిళలకు ప్రభుత్వ పథకాల అమలు, రాయితీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి పథకం ద్వారా దళిత మహిళలకు రాయితీలతో కూడిన రుణాన్ని ఆహార ఉత్పత్తుల కోసం సమకూర్చి వారి అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు తిరుపతమ్మ, డీబీఆర్‌సీ మండల కమ్యూనిటీ మొబలైజర్ గోపనబోయిన వెంకటరావు, అకౌంటెంట్ మార్తమ్మ, సీసీలు పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: పొదిలి మండలం ఆముదాలపల్లి సచివాలయం పరిధిలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చింతలపల్లె గ్రామ సచివాలయం పరిధిలో పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. చింతలపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని పుల్లారెడ్డిపల్లె, యర్రంశెట్టివానిపల్లె, గోహరపల్లె గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకుని ప్రభుత్వ పథకాలు వివరిస్తారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సాయిబాబా మందిరంలో పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

100 మందికి కంటి పరీక్షలు

కురిచేడు: స్థానిక గ్రామ సచివాలయం, పాకనాటి రెడ్లబజారులో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా గురువారం సుమారు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. ఆఫ్తాల్మిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, గురుస్వాములు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. 50 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి జిల్లా అంధత్వ నివారణ సంస్థకు సిఫారసు చేశారు. త్వరలో కంటి అద్దాలు ఉచితంగా అందిస్తామని, నేత్ర శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కంభం: మండలంలోని హజరత్‌గూడెం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాన్ని మండల పీర్ కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్, రికార్డులు పరిశీలించారు. ఎరువు తయారీ కేంద్రాన్ని సందర్శించి తయారీదారులకు పలు సూచనలిచ్చారు. ఈఓపీఆర్‌డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య, కంభం, హజరత్‌గూడెం సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, మహబూబ్‌పీరా, జేసీఎస్ మండల కన్వీనర్ డిష్ మున్నా పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేతో రికార్డులు పటిష్టం


డ్రోన్ కెమెరాను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

కురిచేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమం ద్వారా రైతుల భూములకు సంబంధించిన రికార్డులు పటిష్ట పడతాయని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్ ప్రాంగణంలో గురువారం సమగ్ర భూసర్వే డ్రోన్ కెమెరా ద్వారా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్యతో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ వివాదాలు తరుచూ జరుగుతున్నాయని, వాటన్నింటికీ ఈ సర్వే చెక్ పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాలయాల భూములు అన్యాక్రాంతం జరిగాయని, అవి కూడా వెలుగులోకి వస్తాయని, అటవీ–రెవెన్యూ భూ వివాదానికి కూడా పరిష్కారం లభిస్తుందన్నారు. మండలంలో 19 రెవెన్యూ గ్రామాలున్నాయని, వాటిల్లో ఇప్పటి కి 10 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసినట్లు తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా తెలిపారు. ఎంపీటీసీ బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, కురిచేడు సొసైటీ ప్రెసిడెంట్ మర్రి సుబ్రహ్మణ్యం, నాయకులు ఆవుల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి నాగిరెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, ఇందూరి సుబ్బారెడ్డి, బెల్లం సురేష్, ముశికర యోగిరెడ్డి, వెలుతుర్ల నరిసిరెడ్డి, సర్వేయర్ పి. నాగేశ్వరరావు, వీఆర్వో ఆలా గోపి, కార్యదర్శి గుమ్మడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భూ సర్వేకు సహకరించాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ కొమ్ము విజయకుమారి అన్నారు. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా మండలంలోని ముండ్లపాడులో గురువారం భూ సర్వేపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రెవెన్యూ అధికారులు నిర్వహించే భూ సర్వేలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రీ సర్వే జరిగే సమయంలో వారికి సంబంధించిన ఆధారాల పత్రాలను తప్పకుండా సర్వే ప్రదేశాలకు తీసుకురావాలని కోరారు. భూ సర్వే పకడ్బందీగా ఎటువంటి లోపాలు జరగకుండా నిర్వహించాలని సిబ్బందిని కోరారు. ఎలక్షన్ డీటీ వెంకటరెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ రమణ, ఉప సర్పంచి కడియం శ్రీహరి పాల్గొన్నారు.

ముండ్లమూరు: గ్రామాల్లో జరుగుతున్న భూరీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ నయీం అహ్మద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో రైతుల మధ్య ఏమైనా అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసురావాలన్నారు. సర్వేతో ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్వేపై రైతులకు వివరించి వారి సహాయ సహకారాలతో పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదన్నారు. రైతుల వద్ద ఉన్న రెవెన్యూ రికార్డుల ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో డీటీ పుల్లారెడ్డి, రీసర్వే డీటీ రవికాంత్, మండల సర్వేయర్ శివప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గిరిజన బాలునికి వైద్య సేవలు


మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి

పెద్దదోర్నాల: కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్న గిరిజన బాలుడికి తక్షణమే వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని పలు గిరిజన గూడేల్లో గురువారం ఆయన పర్యటించారు. పనుకుమడుగు గూడేంలో పర్యటించిన ఆయన బాలుడిని పరామర్శించారు. బాలునికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులును ఆదేశించారు. తల్లిదండ్రులు లేని ఆనాథ బాలుడి బాగోగులు చూసేందుకు సంరక్షకులకు రూ.15 వేల విలువ చేసే మేకలు అందిస్తామని హామీ ఇచ్చారు. గూడెంలో నీటి ఇబ్బందులు ఉన్న దృష్ట్యా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి నీటి సమస్యను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భిణులకు ఆయన మందులతో పాటు గూడెంలోని 60 గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, కొర్రప్రోలు, చింతల వైద్యాధికారులు శంకర్‌రెడ్డి, సాయిప్రశాంతి, టెక్నికల్ అసిస్టెంట్ లాలా అహ్మద్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

గంజాయి అమ్మకాలు చట్టరీత్యా నేరం


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ సురేష్

చినగంజాం: గంజాయి అమ్మకాలు సాగించడం చట్టరీత్యా నేరమని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని మోటుపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని సీతా రామాలయంలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి అమ్మడం, తీసుకోవడం నేరం అని వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అదే విధంగా గ్రామాలలో దేవాలయాలు, నివాస గృహాలలో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కే సురేష్, గ్రామ కాపులు, పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పీచ్ కాంపిటీషన్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉషా ఈశ్వరన్

మార్కాపురం టౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో సమాచార వ్యవస్థలో రోజూ వస్తున్న మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఇందిర ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ చైర్మన్, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలోని విద్యార్థులకు స్పీచ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్ మాట్లాడుతూ.. ఏటా మే 17న టెలికమ్యూనికేషన్ డే నిర్వహిస్తారని, అందులో భాగంగా గురువారం విద్యార్థులకు స్పీచ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్‌నెట్ రాక ప్రపంచాన్నే మార్చేసిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు రాజశేఖరరెడ్డి, సురేంద్రరెడ్డి, అబ్దుల్‌కలాం, సాయిబాబా, పుష్పలత, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలి

బేస్తవారిపేట: నివేశన స్థలం పొందిన ప్రతి ఒక్కరూ గృహాలు నిర్మించుకోవాలని తహసీల్దార్ కె.శాంతి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గృహాలు నిర్మంచుకోని లబ్ధిదారులతో ఆమె సమావేశమయ్యారు. గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం నుంచి ఇంటి పట్టా పొంది నేటికీ నిర్మాణ పనులు ఎందుకు మొదలు పెట్టలేదని మండలంలో 350 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. గృహాలు త్వరలో నిర్మించుకుంటామని పలువురు లబ్ధిదారులు అంగీకారపత్రాన్ని ఇచ్చారు. అంగీకార పత్రంలో చెప్పిన సమయానికి ఇంటి నిర్మాణం చేపట్టకుంటే ఇంటిపట్టా రద్దు చేస్తామని హెచ్చరించారు. డీటీ జితేంద్ర కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు వెలుగు కార్యాలంలో గురువారం గ్రామ సంఘాలకు ఆడిట్ జరిగింది. 2022–23కు సంబంధించిన గ్రామ సంఘాల లావాదేవీలను ఆడిటర్ కె సురేష్ క్షుణంగా పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 38 గ్రామ సంఘాలకు గాను 21 గ్రామ సంఘాలు ఆడిట్ జరిగినట్లు తెలిపారు. క్యాష్ బుక్, లెడ్జర్, వోచర్లు, సీఐఎఫ్ లోన్ల డాక్యుమెంట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్‌సీ విజయ్‌భాస్కర్, సీసీలు కామేశ్వరావు, దాసు, నరసింహరావు, అకౌంటెట్ భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

జే.పంగులూరు: ఖరీఫ్ సీజన్‌లో 2023–24కు సంబంధించి పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీ మీద ఇవ్వ నున్నట్లు ఏవో సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు ఎకరాకు 10 కేజీల చొప్పున ప్రతి రైతుకు ఐదెకరాల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. జీలుగలు కేజీ పూర్తి ఖరీదు రూ. 79 కాగా, సబ్సీడీపై రూ. 39.50 ఇవ్వనున్నట్లు తెలిపారు. జనుము రూ. 84 కాగా, రాయితీపై రూ. 42 కి రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రం వద్ద తీసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ తీసుకు వెళ్లాలని తెలిపారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యాకానుక కిట్లు

యద్దనపూడి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైయ్యే నాటికి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మండల విద్యాశాఖాధికారి పుల్లెల సుబ్రమణ్యేశ్వరావు తెలిపారు. ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్న జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పరిశీలించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలను సర్దిఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే విద్యాకానుక కిట్లలో పాఠ్యపుస్తకాలతో పాటు, యూనిఫాం, షూ కూడా వచ్చాయన్నారు. ఈ ఏడాది యూనిఫాం కలర్ కూడా మారాయన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు జీవన్, ప్రేమ్‌కుమార్, స్థానిక ఉపాధ్యాయులు ఉన్నారు.

చేనేత వృత్తి రక్షణ కోసం ఐక్య ఉద్యమం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

చీరాల: వ్యవసాయ రంగం తర్వాత రెండో అతి పెద్ద రంగమైన చేనేత రంగం రక్షణకు ఐక్య ఉద్యమాలు అవసరమని చేనేత సంఘాల రాష్ట్రనాయకులు పేర్కొన్నారు. గురువారం చీరాల పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో చేనేత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చేనేత నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు మల్లికార్జున, వై.కోటేశ్వరరావు, ఎం.మోహనరావు, బాలకృష్ణ, నాగేశ్వరరావు, కొండయ్య, సుబ్బారావు, అధిక సంఖ్యలో చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ చట్టసభల్లో ఉన్న చేనేత సామాజిక వర్గం ప్రజాప్రతినిధులు చేనేతల సమస్యల పరిష్కారానికి, చేనేతల సంక్షేమానికి పాటుపడాలన్నారు. చేనేతలకు అవసరమైన నూలు, పట్టు, జరీ, రంగులు, రసాయనాలను ప్రభుత్వమే 40 శాతం సబ్సిడీతో అందిస్తే చేనేతలకు ఎనలేని మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్షకు 409 మంది హాజరు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో జరిగిన ఏపీఈఏపీ సెట్–2023 పరీక్షలకు 409 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైపీసీ, విద్యార్థులకు 22 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వ హిస్తున్నారని తెలిపారు. మొత్తం 430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 21 మంది గైరుహాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు.

పాత కలప వేలం నేడు

అద్దంకి: స్థానిక పాత పోలీస్ స్టేషన్‌ను తీసేవేసే క్రమంలో అందులో వచ్చిన పాత కలప (టేకు) దుంగలకు వేలం నిర్వహించనున్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారులచే ధరను అంచనా వేయించారని పోలీసు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కలపను నేడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహిస్తారని, వేలంలో పాల్గొనాలనుకునే వారు హాజరు కావాలని పోలీసులు ప్రకటనలో కోరారు.

సంస్కృతికి కథలు ప్రతీకలు


యోగాసన పోటీల్లో విజేతలతో లైబ్రేరియన్ శివారెడ్డి

మార్కాపురం టౌన్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా కథలు నిలుస్తున్నాయని గ్రంథపాలకులు జీవీ శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథలు చెప్పించడం, చదివించడం, చెస్, యోగాపై అవగాహన కల్పించి, పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మహాభారతం, రామాయణం, జానపద, చారిత్రాత్మక కథలను విద్యార్థులకు చెబుతున్నామని లైబ్రేరియన్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విజ్ఞాన శిబిరానికి పంపాలని కోరారు. యోగాసన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీల్లో భరత్, రాజేష్, కార్తీక గెలుపొందినట్లు తెలిపారు.

మట్టి ఖర్చుల కోసం రూ.10 వేల సాయం


మహిళకు నగదు అందిస్తున్న సర్పంచ్ నాగరత్నమ్మ

కొమరోలు: మండలంలోని ఇడమకల్లులో పసుపుల గురువయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మట్టి ఖర్చుల కోసం గురువయ్య కుటుంబ సభ్యులకు సర్పంచ్ నాగరత్నమ్మ 10 వేల రూపాయల నగదును గురువారం అందచేశారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ నాగరత్నమ్మ ఓదార్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, రమణయ్య, గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి


మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

పెద్దారవీడు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ అన్నారు. మండలంలో సుంకేసుల సచివాలయంలో పీఎస్ పెద్దిరాజు అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ సంచ్‌లను వాడరాదని, బట్టల సంచులు వాడాలని సూచించారు. సచివాలయ సిబ్బంది శ్రీను నాయక్, ఆమీర్‌బాషా, వెంకటేశ్వరరెడ్డి, పురుషోత్తం, సుభానమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంతో మేలు

మార్టూరు: మార్టూరు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదివించటం, చెప్పించటం, పాటలు, పద్యాలు, క్యారం బోర్డు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పావులూరి జానకి రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రానైట్ లారీలు స్వాధీనం

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఐదు గ్రానైట్ లారీలను ఒంగోలు మైనింగ్ విజిలెన్స్ ఏడీ ఈరేష్ గురువారం బల్లికురవ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలించటం నేరమన్నారు. ఎంతటివారికైనా పెనాల్టీ తప్పదన్నారు. గ్రానైట్ లారీలను బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

బాధ్యతలు గుర్తెరగాలి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలకు పౌర సేవలందించేదుకు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు బాధ్యతలు గుర్తెరిగి అంకిత భావంతో పనిచెయ్యాలని తహసీల్దార్ జీవి సుబ్బారెడ్డి కోరారు. గురువారం వైదన సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమెంట్, స్పందన రిజిస్టర్‌లను తనీఖీలు చేసి సంతృప్తి చెందారు.

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు


కారంచేడులో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం

కారంచేడు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఉందని తహసీల్దారు ఎస్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు–3 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని రైతులకు, విద్యార్థులకు అవసరమైన అర్జీల పరిష్కారంలోను సిబ్బంది ముందుండాలన్నారు. వారి నుంచి స్పందనకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అరుణ, జగదీశ్వరి, వీఆర్ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల టౌన్: ప్రభుత్వం అందించే పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీవో కె.నేతాజీ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్నీ సచివాలయాల సెక్రటరీలు, వివిధ శాఖల ఉద్యోగులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, ఉద్యోగులు, పంచాయతీల సెక్రటరీలు ఉన్నారు.